క్లుప్తంగా

హరినామ సంకీర్తనతో ప్రశాంతత



ఇస్కాన్‌లో పూజలందుకుంటున్న జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌మూర్తులు

కర్నూలు కల్చరల్: హరినామ సంకీర్తన జపంతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఇస్కాన్ బాధ్యులు రఘునంద సేవక ప్రభు అన్నారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో ఆదివారం భగవద్గీత శిక్షణా తరగతులు, శీల ప్రభుపాద ప్రేమ విందు కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం భగవద్గీత పఠనం, శ్రవణం వల్ల ఉత్తమ జీవిత గమనానికి మార్గదర్శకంగా ఉంటుందన్నారు. ఎన్నో క్లిష్ట సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. అనంతరం హరే రామ హరే కృష్ణ మంత్రాన్ని జపం చేయించారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

స్కేటింగ్ విజేతలకు మెడల్స్ ప్రదానం



విజేతలకు మెడల్స్ బహూకరించిన మేనేజర్ చిన్నరాముడు, సురేంద్ర

కర్నూలు (టౌన్): స్కేటింగ్‌లో ప్రతిభ చాటిన చిన్నారులను నగరపాలక మేనేజర్ చిన్నరాముడు, మాజీ కార్పొరేటర్ గుడిపల్లె సురేంద్ర అభినందించారు. రెండు రోజులుగా బి క్యాంపులోని ఖానా ఖజానా రోడ్డులో నిర్వహిస్తున్న స్కేటింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ఆదివారం మెడల్స్ బహుకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్నారులు స్కేటింగ్ క్రీడలో రాణించడం శుభ పరిణామమన్నారు. రోజూ సాధన చేసి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. రోడ్ రేస్, రింక్ రేస్‌లో గెలుపొందిన క్రీడాకారులను అభినందించారు. స్కేటింగ్ కార్యదర్శి అబుబకార్, సీఈఓ సునీల్ కుమార్ ఉన్నారు.


ఉద్యోగాలకు ఎంపికైన వారికి సన్మానం



ఉద్యోగార్థులను సన్మానిస్తున్న అవోపా సభ్యులు

కర్నూలు కల్చరల్: అవోపా ఆధ్వర్యంలో ఆదివారం ఆంధ్ర అన్నపూర్ణగా పేరు ప్రఖ్యాతులు గడించిన డొక్కా సీతమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక అమీన్ హైదర్ ఖాన్ నగర్‌లో అన్నదానం చేశారు. అనంతరం ప్రభు త్వ ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన ఆర్య వైశ్య యువతీ యువకులను అవోపా సేవా సదన్‌లో ఘనంగా సన్మానించారు. అవోపా అధ్యక్షుడు డాక్టర్ పి.లక్ష్మీనారాయణ, చీఫ్ కన్వీనర్ నాగేశ్వరరావు, కార్యదర్శి మురళీ కృష్ణ, కోశాధికారి వెంకటేశ్వర్లు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటన ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు కల్చరల్: ఉమ్మడి జిల్లాలో ఈనెల 16వ తేదీన దేశ ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనను విజయవంతం చేయాలని మంత్రి టీజీ భరత్ పిలుపునిచ్చారు. ఆదివారం నన్నూరు టోల్‌గేట్ సమీపంలోని రాగమయూరిలో సభ ప్రాంగణం వద్ద ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ.. ప్రధాని ఈ నెల 16న శ్రీశైలంలో స్వామివారి దర్శనం పూర్తి చేసుకున్న అనంతరం కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేసిన సభకు రానున్నారన్నారు. సభకు హాజరు కావడంతో పాటు వర్చువల్ విధానం ద్వారా వివిధ ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఇందుకు ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయన్నారు. ప్రధాని పర్యటన విజయవంతం చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. మంత్రి వెంట ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్ తదితరులు ఉన్నారు.

హొళగుంద ఏఓగా జిలానీబాషా

కర్నూలు(అగ్రికల్చర్): హాలహర్వి మండల వ్యవసాయ అధికారిగా జిలానీ బాషా నియమితులయ్యారు. ఈయన పత్తికొండ మండలంలో వ్యవసాయ విస్తరణ అధికారిగా పనిచేస్తున్నారు. ప్రభుత్వ అనుమతితో అగ్రికల్చర్ బీఎస్సీ పూర్తి చేశారు. హాలహర్వి మండల వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్న వేదానందం డిప్యుటేషన్‌పై ఎమ్మిగనూరు ఫామ్‌కు బదిలీ అయ్యారు. ఈ స్థానంలో జిలానీబాషాను పూర్తి అదనపు బాధ్యతలతో ఏవోగా నియమించారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

అమ్మతనానికి ఆపద!

- పెరుగుతున్న రొమ్ము క్యాన్సర్ బాధితులు
- జన్యుపర సమస్యలు, జీవనశైలి కారణాలు
- ప్రాథమిక దశలో నిర్ధారించి చికిత్స తీసుకుంటే మేలు
- ఈ నెల రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసం



కర్నూలు(హాస్పిటల్): ప్రతి వ్యక్తి జన్మించాక మొదటగా తీసుకునే ఆహారం తల్లి పాలే. తల్లి తన రక్త మాంసాలను పాలగా మార్చి బిడ్డకు ఇచ్చి ప్రాణం పోస్తుంది. ఇలాంటి అమ్మతనానికి రొమ్ము క్యాన్సర్ మహమ్మారి ఆపద తెస్తోంది. ప్రాథమిక దశలో గుర్తిస్తే ఫర్వాలేదు. లేదంటే రోగం ముదిరి ప్రాణాలను హరించి వేస్తుంది. ఈ నెల రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసం సందర్భంగా ప్రత్యేక కథనం.

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు పెంచికలపాడు విశ్వభారతి క్యాన్సర్ హాస్పిటల్, ఒమెగా క్యాన్సర్ హాస్పిటల్‌లలో బాధితులకు వైద్యసేవలు అందుతున్నాయి. వీటిలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కూడా ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో 40 మంది దాకా క్యాన్సర్ వైద్యులు అందుబాటులో ఉన్నారు. వీరి వద్ద చికిత్స పొందుతున్న బాధితుల్లో 27 శాతం మంది రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు గణాంకాలను బట్టి తెలుస్తోంది. ఈ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే చికిత్స సులభమని, సరైన అవగాహన లేకపోవడం వల్ల చాలా మంది చివరి దశలో చికిత్స కోసం వస్తున్నారని వైద్యులు చెబుతున్నారు.

రొమ్ము క్యాన్సర్ ఇలా వస్తుంది

మహిళ రొమ్ములో ఆరోగ్యకర కణాలు నియంత్రణ లేకుండా పెరగడం వల్ల గడ్డలు ఏర్పడి కాలక్రమంలో క్యాన్సర్‌గా మారే అవకాశం ఉంది. రొమ్ము క్యాన్సర్ దశను క్యాన్సర్ ఉన్న ప్రాంతాన్ని బట్టి నిర్వచిస్తారు. ఎంత మేరకు క్యాన్సర్ విస్తరించింది, ఎక్కడకు విస్తరించిందనేది కూడా ఈ దశల నిర్ణయంలో కీలకంగా మారుతుంది. రొమ్ము క్యాన్సర్‌లు శరీరంలోని ఎముకలు, ఊపిరితిత్తులు, కాలేయం, మెదడుకు కూడా విస్తరించే అవకాశం ఉంది. రొమ్ము క్యాన్సర్‌తో పలు ప్రమాద కారకాలు మిళితమై ఉంటాయి. కొన్ని నియంత్రించడం కష్టమైతే కొన్నింటిని నియంత్రించవచ్చు.

జిల్లాలో రొమ్ము క్యాన్సర్ కేసులు

సంవత్సరం	సర్జికల్ ఆంకాలజీ	మెడికల్ ఆంకాలజీ	రేడియేషన్ ఆంకాలజీ
2019-20	1,892	2,569	1,802
2020-21	3,658	2,434	3,512
2021-22	4,396	5,236	4,239
2022-23	5,124	5,796	4,939
2023-24	5,775	6,164	5,594
2024-25	5,897	5,999	5,445

వీటిని నియంత్రించలేరు

కుటుంబ చరిత్ర

కుటుంబసభ్యుల్లో ఎవ్వరికైనా రొమ్ము క్యాన్సర్ ఉండి ఉంటే ఆ కుటుంబంలో ఇతరులకు రొమ్ము క్యాన్సర్‌లు వృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి. అయితే జన్యుపరంగా రొమ్ము క్యాన్సర్‌లు వచ్చేందుకు తక్కువ అవకాశాలున్నాయి. మొత్తం రొమ్ము క్యాన్సర్ కేసుల్లో వీటి సంఖ్య చాలా స్వల్పమని వైద్యులు చెబుతున్నారు.

వీరు జాగ్రత్తగా ఉండాలి

- శారీరకంగా చురుగ్గా లేనివారు
- ఊబకాయం/అధిక బరువు ఉన్నవారు
- హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపి చేయించుకున్న వారు
- 30 ఏళ్ల తర్వాత మొదటి గర్భం దాల్చిన వారు
- సంతానానికి పాలివ్వని వారు
- మద్యం సేవించేవారు

ఇలా చేయాలి

- పౌష్టికాహారం తీసుకోవడం
- శారీరక వ్యాయామాలు చేయడం
- సరైన బరువు నిర్వహించుకోవడం

రొమ్ము క్యాన్సర్ లక్షణాలు

- రొమ్ముల్లో గడ్డలు/బరువుగా అనిపించడం
- రొమ్ముల ఆకృతి, పరిమాణం మారడం, నొప్పి
- చనుమొనల నుంచి ద్రవాలు కారడం
- చనుమొనల చుట్టూ ఎరుపుగా దద్దుర్లు ఉండటం
- చర్మపు రంగులో మార్పులు

పునరుత్పత్తి చరిత్ర

మహిళలు త్వరగా మెనోపాజ్ దశకు చేరుకుంటే వారికి రొమ్ము క్యాన్సర్‌లు వృద్ధి చెందే అవకాశం అధికంగా ఉంటుంది. ఈస్ట్రోజెన్ హార్మోన్‌కు అధికంగా ఎక్స్‌పోజ్ కావడం వల్ల ఈ ప్రమాదం పొంచి ఉంటుంది.

వ్యాధి నిర్ధారణ పరీక్షలు

మామోగ్రఫీ స్క్రీనింగ్ ద్వారా ఈ క్యాన్సర్‌లను గుర్తిస్తారు. రొమ్ములో ఏదైనా అసాధారణతను గుర్తించేందుకు ఈ రేడియోగ్రాఫిక్ సాంకేతికత ఉపయోగిస్తారు. 40 ఏళ్లు దాటిన మహిళలు ఏడాదికి ఒకసారి మామోగ్రామ్ పరీక్షలు చేయించుకోవడం ముఖ్యం.

ఉచితంగా క్యాన్సర్ వైద్యం



కర్నూలులోని స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో అత్యాధునిక వసతులు, పరికరాలు అందుబాటులో ఉన్నాయి. మెడికల్, సర్జికల్, రేడియేషన్ ఆంకాలజీకి సంబంధించిన వైద్యులు ఉన్నారు. ఇక్కడ అన్ని రకాల క్యాన్సర్లకు వైద్యం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఆసుపత్రికి వస్తున్న క్యాన్సర్లలో 30 నుంచి 40 శాతం మంది రోగులు కేవలం రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. రొమ్ము క్యాన్సర్‌ను నిర్ధారించేందుకు త్వరలో మామోగ్రఫి స్కాన్ మిషన్ రానుంది.

– డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్, డైరెక్టర్, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్, కర్నూలు

ముందుగా గుర్తిస్తే నివారణ



నా 16 ఏళ్ల సర్వీసులో 7 వేలకు పైగా రొమ్ము క్యాన్సర్ కేసులకు సర్జరీలు చేశాను. చాలా మంది బాధితులు 2, 3వ దశల్లో చికిత్స కోసం వస్తున్నారు. అలాగాకుండా ముందుగా మామోగ్రఫి, ఎక్స్‌రే పరీక్షలు చేయించుకుని వస్తే రొమ్ము తీసేయాల్సిన అవసరం లేకుండానే చికిత్స అందించవచ్చు. ముందుగా గుర్తించడం ద్వారా మాత్రమే క్యాన్సర్‌ను నియంత్రించడం సాధ్యమవుతుంది. 40 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ ఈ పరీక్షలు చేయించుకోవాలి. ముందుగా పరీక్షలు చేయించుకోవడం వల్ల అమెరికా, యుఎస్‌లలో ఎక్కువ మంది కోలుకుంటున్నారు.

– డాక్టర్ బి.రవీంద్రబాబు, సర్జికల్ ఆంకాలజిస్టు, కర్నూలు

రజకులకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి

మద్దికెర: కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న రజకులకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని రజక సంఘం మండల అధ్యక్షుడు చిరంజీవి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇస్త్రీ బంకులు పెట్టుకొని జీవనం చేస్తున్న వారికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలన్నారు. మండలంలో దాదాపు వెయ్యి కుటుంబాలు ఉన్నాయని, కులవృత్తి చేసుకోడానికి పరికరాలు అంజేయాలని కోరారు.

టమాటకు గిట్టుబాటు ధర కల్పించాలి



పత్తికొండ మార్కెట్‌యార్డు స్పెషల్ ఆఫీసర్ పద్మావతితో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

పత్తికొండ రూరల్: పత్తికొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో టమాట ధరలు పతనమయ్యాయని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు.ఆదివారం మార్కెట్‌లో టమాట జత గంపలు రూ.70 నుంచి రూ.60 మాత్రమే పోయాయని, ఈ లెక్కన రైతులకు రూ.3 రూపాయలు మాత్రమే వస్తుందనే విషయం తెలుసుకుని పార్టీ నాయకులు యార్డును సందర్శించి స్పెషల్ ఆఫీసర్ పద్మావతికి పరిస్థితిని వివరించారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను దోచుకు తింటున్నారన్నాని ఆరోపించారు. స్పందించిన అధికారిణి సెక్రటరీ కార్నలీస్‌తో మాట్లాడి వ్యాపారులను పిలిపించి తక్కువ ధరకు కొనుగోలు చేసిన వ్యాపారుల చిట్టీలు పరిశీలించి వ్యాపారులతో కిలో రూ.8 ప్రకారంగా ఇప్పించారు. ఇక్కడి వ్యాపారులు ప్రభుత్వ మద్దతు ధర ప్రకారంగా కొనుగోలు చేయడం లేదని, నాణ్యతను బట్టి సరుకు రూ.25 ప్రకారంగా కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ పార్టీ మండల కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, నాయకులు రంగారెడ్డి, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయంగా కేఎంసీ రహదారులు



మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ వద్ద రోడ్డు దుస్థితి



ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగం వద్ద కంకర తేలిన రోడ్డు

కర్నూలు మెడికల్ కాలేజీలో అంతర్గత రహదారులు గుంతలమయంగా మారాయి. ఐదేళ్ల క్రితం కళాశాల మొత్తంగా వేసిన సీసీ రోడ్లు నాసిరకంగా నిర్మించడం వల్ల అప్పుడే దెబ్బతిన్నాయి. దీంతో కళాశాలలో ఎక్కడ చూసినా గుంతలమయంగా, కంకర తేలిన రహదారులు దర్శనమిస్తున్నాయి. కళాశాల నుంచి బయటకు వెళ్లే దారిలో వర్షాకాలంలో రహదారిపైనే వర్షపు నీరు నిలవడం వల్ల వైద్యులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల కంకర తేలి ఉండటంతో బైక్‌లు, స్కూటీలపై వెళ్లే వారు జారి పడుతున్నారు. రహదారుల నిర్మాణం కోసం కళాశాల అభివృద్ధి సొసైటీలో నిధులున్నా అధికారులు వాటిని ఖర్చు చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు అంతర్గత రహదారులపై దృష్టి సారించాలని వైద్యులు, విద్యార్థులు కోరుతున్నారు.

– కర్నూలు(హాస్పిటల్)

ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం

కర్నూలు కల్చరల్: కర్నూలు మండల పరిధిలోని వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ఉన్న ఆలయాన్ని శాస్త్రోక్తంగా కూల్చివేత చేపట్టి అదే స్థానంలో నూతన ఆలయాన్ని నిర్మించేలా పనులు ప్రారంభించారు. పోలీస్ బందోబస్తు, దేవస్థానం అర్చకులు ఎల్లరాజు, నారాయణ, బాలరాజు, మధు సమక్షంలో పనులు ప్రారంభించినట్లు ఆలయ ఈఓ రాధాకృష్ణ తెలిపారు.

వలసల సీమగా మార్చేశారు



కరపత్రాలను విడుదల చేస్తున్న వామపక్ష నాయకులు

పత్తికొండ: రాయలసీమను వలసల సీమగా కూటమి నాయకులు మార్చేశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రామచంద్రయ్య, సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు గిడ్డయ్య, గౌస్‌దేశాయ్ అన్నారు. ఆదివారం స్థానిక చదువుల రామయ్యభవన్‌లో ఈనెల 16వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటనను నిరసిస్తూ కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ...బీజేపీ గతంలోనే సీమ అభివృద్ధి కోసం రాయలసీమ డిక్లరేషన్ అనే నినాదాన్ని రాజకీయంగా వాడుకొని తదనంతర కాలంలో దానిని మరుగున పడేసిందని విమర్శించారు. రాష్ట్రానికి చేసిన ద్రోహం మరిచి పర్యటన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రాయలసీమ అభివృద్ధిని అడ్డుకున్న మోదీని కర్నూల్ సమావేశంలో చంద్రబాబు నిలదీయాలని డిమాండ్ చేశారు. జీఎస్టీ పేరుతో ఏళ్ల తరబడి ప్రజలను మోసం చేసి, కొత్తగా ఇప్పుడు జీఎస్టీ తగ్గించామని సంబరాలు చేసుకోవడం కూటమి నాయకులకే చెల్లిందన్నారు. రాయలసీమ అభివృద్ధి కోసం పాటు పడకుండా వలసల సీమగా మార్చేశారని మండిపడ్డారు. మోదీ పర్యటనను నిరసిస్తూ 15 వ తేదీన జిల్లాలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతామని చెప్పారు. నాయకులు సురేంద్రకుమార్, రాజాసాహెబ్, పెద్దవీరన్న, కారన్న, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణ ఆపాలి

ఆదోని రూరల్: ఆదోని మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణ వెంటనే ఆపాలని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం డీవైఎఫ్‌ఐ ఆదోని మండల కమిటీ సమావేశం మండల నాయకులు శ్రీకృష్ణ అధ్యక్షతన సూపర్ బజార్‌లోని సీఐటీయూ కార్యాలయంలో జరిగింది. సమావేశాన్ని ఉద్దేశించి జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ పేరుతో ప్రజల సొమ్మును, ప్రజల ఆస్తులను కారు చౌకగా కార్పొరేట్ కంపెనీలకు ఇవ్వడం పనిగా పెట్టుకుందని విమర్శించారు. దేశంలోని ప్రతి పౌరునికి ఉచిత విద్య, వైద్యం అందించాలని రాజ్యాంగం చెబుతున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయన్నారు. సమావేశంలో డీవైఎఫ్‌ఐ మండల కన్వీనర్ బీసీ వీరేష్, నాయకులు గర్జప్ప, హుసేన్, రమేష్ పాల్గొన్నారు.

కర్నూలు ఉత్సవ్‌లో కళా ప్రదర్శనలు



మాట్లాడుతున్న కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రంలో నవంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు కర్నూలు ఉత్సవ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య పేర్కొన్నారు. ఆదివారం సీక్యాంప్ కళాక్షేత్రంలో కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల నిర్వహణపై ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు చెప్పారు. ఉమ్మడి జిల్లాలోని చారిత్రక అంశాలు, సాంస్కృతిక, సాహిత్య, సాంఘిక అంశాలను వెల్లడించే విధంగా ఉత్సవ్ ఉంటుందన్నారు. అలాగే శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, జానపద నృత్యాలు, సంగీత ప్రదర్శనలు, కవి సమ్మేళనాలు, సాహిత్య సభలు, వ్యాసరచన పోటీలు, తోలు బొమ్మలాట, బుర్రకథ, హరికథ, పౌరాణిక నాటక, ఏకాంకిక నాటక ప్రదర్శనలు ఉంటాయని వెల్లడించారు. వారం రోజుల పాటు ప్రముఖుల ఛాయచిత్ర ప్రదర్శన ఉంటుందని చెప్పారు. కళాక్షేత్రం కార్యదర్శి యాగంటీశ్వర్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లో వెలుగులు నిండాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

ఓర్వకల్లు: దీపావళి జ్ఞాన జ్యోతి వెలుగులు ప్రతి ఇంట్లో వెలగాలని ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ సభ్యుడు రామచంద్రుడు ఆకాంక్షించారు. దీపావళి పండుగ పురస్కరించుకొని మండలంలోని ఎస్.కొంతలపాడు, హెచ్.కొట్టాల గ్రామాలలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. సమితి అధ్యక్షుడు రామచంద్రుడు మాట్లాడుతూ.. 'గురువు తమ జ్ఞానాగ్నితో శిష్యుల తలలో జ్ఞాన జ్యోతిని వెలిగించి యోగ మార్గంలో నడిపిస్తాడనేందుకు గుర్తుగా దీపావళి రోజున ప్రతి ఇంట్లో దీపాలను వెలిగించాలని పేర్కొన్నారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రబోధ సేవా సమితి కమిటీ సభ్యులు గోకారి, శ్రీనివాసులు, రవి, జగదీశ్, సుబ్బలక్ష్మి, సుజాత, హైమావతి, రమణమ్మ, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు



గాయపడిన విజయ్

మద్దికెర : మండల కేంద్రం శివారు జొన్నగిరి గ్రామానికి వెళ్లే దారిలో ఆదివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొనడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. వివరాలు.. ఎం.అగ్రహారం గ్రామం నుంచి వస్తున్న రవి..గుంతకల్లు నుంచి జొన్నగిరి గ్రామానికి వెళ్తున్న విజయ్, ప్రశాంతి ప్రయాణిస్తున్న వాహనాన్ని ఎం.అగ్రహారం మలుపు వద్దనున్న తోట వద్ద అతివేగంగా వచ్చి ఢీ కొట్టడంతో గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లి ప్రథమ చికిత్స అనంతరం గుంతకల్లుకు తరలించారు.

సమర్థవంతంగా పనిచేయండి



మాట్లాడుతున్న కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు (టౌన్): ఈ నెల 16న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జిల్లా పర్యటన పురస్కరించుకొని నగరపాలక అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. ఆయన ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. ఏర్పాట్లలో భాగంగా రహదారుల మరమ్మతులు, పార్కింగ్ ప్రదేశాల ఏర్పాటు, సైన్ బోర్డులు, దీపాల ఏర్పాటు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య చర్యలు, మొబైల్ టాయిలెట్లు, స్నాక్స్, హెల్ప్ డెస్క్‌లకు పూర్తి స్థాయి దృష్టి సారించాలన్నారు. నగరంలో సుందరీకరణ, పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి విభాగం అధికారులు తమ పనులు సకాలంలో పూర్తి చేసి సమన్వయంతో ముందుకు సాగాలని ఆదేశించారు. అదనపు కమిషనర్ ఆర్‌జీవీ క్రిష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంఈ మనోహర్ రెడ్డి, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు పాల్గొన్నారు.

రోడ్డు ఛిద్రం.. ప్రయాణం నరకం





లక్ష్మీపురం గ్రామానికి వెళ్లే రోడ్డు దుస్థితి



కల్లూరు: కల్లూరు అర్బన్ పరిధి 28వ వార్డు లక్ష్మీపురం గ్రామానికి వెళ్లే దారిపై ప్రయాణించాలంటే నరకం కనిపిస్తోందని వాహనదారులు, ప్రయాణికులు వాపోతున్నారు. 44వ జాతీయ రహదారి నుంచి లక్ష్మీపురం గ్రామానికి సుమారుగా రెండు కిలోమీటర్ల దూరం ఉంది. ఈ మార్గంలో ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో ప్రయాణం చేయాలంటే ఒళ్లు హూనమవుతోందని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ రోడ్డులోనే కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఉంది. ఆ విద్యాలయం ముందు రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారింది. అక్కడి నుంచి కర్నూలు వైపు వస్తే మలుపు వద్ద మొత్తం రోడ్డు ధ్వంసమైంది. దీంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పితే ప్రమాదాలకు గురికావాల్సి వస్తోంది. లక్ష్మీపురం, దొడ్డిపాడు గ్రామాల ప్రజలు, రైతులు, వ్యవసాయ కూలీలు, అలాగే ఎడ్ల బండ్లపై పొలాలకు ఎరువులు, మందులు తీసుకెళ్లేవారు నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి సమయంలో రోడ్డుపై ప్రయాణించాలంటే మరింత ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.

ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న ఆటో యూనియన్ నాయకులు

కల్లూరు: 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం ప్రారంభోత్సవం సందర్భంగా ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్, మండల కార్యదర్శి కె.మధు డిమాండ్ చేశారు. ఆదివారం ఉలిందకొండ గ్రామ ఆటో డ్రైవర్ల విస్తృత స్థాయి జనరల్ బాడీ సమావేశం మండల కార్యదర్శి జి.మధు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం వల్ల నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకుంటామని కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. వెంటనే సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు ఏడాదికి కేవలం రూ.15 వేలు మాత్రమే ఇచ్చి గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. దీని వల్ల డ్రైవర్లకు ఒరిగేదేమీ లేదన్నారు. ఆటో డ్రైవర్ల సేవలో పథకం సొమ్మును రూ.30 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఆటో యూనియన్ నాయకులు బొగ్గుల బాష, నరేష్, శేఖర్, సుంకన్న, నవీన్, వెంకటేష్, శీను, దస్తగిరి, నాగయ్య, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



బొల్లవరంలో మురుగు పారేందుకు మార్గం చేస్తున్న దృశ్యం

రోడ్లపైనే మురుగు



పుసులూరులో రోడ్డుపై పారుతున్న మురుగు

కల్లూరు: పుసులూరు గ్రామంలో డ్రైనేజీ కాలువ పూడికతో నిండడంతో కాలువలో ప్రవహించాల్సిన మురుగంతా రోడ్డుపైకి వస్తోంది. బురద ఉండటం వల్ల దోమలకు నెలవుగా మారుతోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మురుగు వల్ల దోమలు, ఈగలు, లార్వాలు వృద్ధి చెందుతున్నాయని వాపోతున్నారు. మురుగు నీరు రోడ్డుపైకి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మురుగు, వర్షపు నీరు ముందుకు వెళ్లేందుకు కాలువలు సరిగా లేకపోవడంతో రోడ్డు పక్కన నిలుస్తోంది. మురుగు నీరు ముందుకు పారేలా ఓ వ్యక్తి సలికతో తాత్కాలికంగా మార్గం చేశాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా మ్యాన్ హోల్



తెరచి ఉన్న మ్యాన్ హోల్

ఓర్వకల్లు: డ్రైనేజీపై నిర్మించిన సీసీ రోడ్డుపై అక్కడక్కడ ఏర్పాటు చేసిన మ్యాన్ హోల్స్ వద్ద ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రమాదానికి గురికావాల్సిందే. మండలంలోని హుసేనాపురం గ్రామంలో ఇలాంటి పరిస్థితి నెలకొంది. స్థానిక సంత మార్కెట్‌లో నిత్యం వందలాది మంది ప్రజలు సంచరించే ప్రాంతంలో మురుగునీటి ప్రవాహం కోసం సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి మినరల్ వాటర్ ప్లాంట్ వరకు మురుగు కాల్వను నిర్మించారు. ఈ కాల్వపై సీసీ రోడ్డును నిర్మించారు. కాల్వను శుభ్రపరచేందుకు వీలుగా మూడు చోట్ల మ్యాన్ హోల్స్ ఏర్పాటు చేశారు. మ్యాన్‌హోల్స్‌కు మూతలు ఏర్పాటు చేయకుండా ఓపెన్‌గా వదిలేశారు. దీంతో రాత్రి వేళ అటుగా వెళ్లే ప్రజలు మైమరిచి కాలుపెడితే ప్రమాదానికి గురికావాల్సిందేనని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మ్యాన్‌హోల్స్‌పై మూతలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.